త్యాగాల నుంచి ప్రేరణ పొందాలి

సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్‌మొహంతి



పోలీసు అధికారులకు ఉత్తమసేవా పతకం అందిస్తున్న కమిషనర్ అవినాష్ మొహంతి

గచ్చిబౌలి: శాంతిభద్రతలను కాపాడటంలో, జాతీయ సమగ్రత, అంకితభావంతో ప్రజలకు సేవ చేయడంలో పోలీసుదళం కీలకపాత్ర పోషిస్తోందని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మొహంతి పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం ఆయన జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ త్యాగాల నుంచి నిరంతరం ప్రేరణ పొంది అచంచలమైన సంకల్పం, నిబద్ధతతో ముందుకుసాగాలన్నారు. అనంతరం సైబరాబాద్‌లో 7 మంది అధికారులను ఉత్తమ సేవా పతకాలు అందజేశారు. కార్యక్రమంలో సైబరాబాద్ జాయింట్ సీపీ (ట్రాఫిక్) డాక్టర్ గజారావు భూపాల్, డీసీపీలు మాదాపూర్ వినీత్‌కుమార్, కోటిరెడ్డి, సురేష్‌కుమార్, సీహెచ్‌శ్రీనివాస్, బిరాజేష్, ముత్యం రెడ్డి, సాయిశ్రీ, సృజనకర్ణం, సాయి మనోహర్, శోభన్‌కుమార్, సంజీవ్, రంజన్ రతన్‌కుమార్, ఎలిసి నాయక్, ఏడీసీపీలు అడ్మిన్ రవిచందన్‌రెడ్డి, షమీర్, శ్రీనివాసరావు, ఏడీసీపీ, ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి



మియాపూర్ : మియాపూర్ మదీనాగూడ దీప్తీ శ్రీనగర్ కాలనీలోని ఐరీస్ ఫ్లోరెట్స్ పాఠశాలలో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు కృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో అందరిని ఆకట్టుకున్నారు. ఉట్టి కొట్టే కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు రెయిన్‌కోట్ల పంపిణీ

శంషాబాద్ రూరల్: స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మండలంలోని రామాంజాపూర్‌లో పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు శుక్రవారం దాత మహేష్‌కుమార్ రెయిన్‌కోట్లు పంపిణీ చేశారు. పదో తరగతిలో ప్రథమ స్థానం పొందిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తానని హామీ ఇచ్చారు. వర్షాలతో పాఠశాల ఆవరణలో చేరుతున్న వరదనీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

హుక్కా పార్టీపై పోలీసుల దాడి: ఏడుగురి అరెస్టు

శంషాబాద్ రూరల్: అనుమతి లేకుండా హుక్కా పార్టీ నిర్వహిస్తున్న ఏడుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గండిగూడ గ్రామంలో ఉన్న ఎంఆర్‌జీ ఫాంహౌస్‌లో గురువారం రాత్రి కొందరు హుక్కా పార్టీ జరుపుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు దాడులు నిర్వహించారు. వారి వద్ద హుక్కా తాగే పరికరాలు, ఒక స్కూటీ, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాలకు కంప్యూటర్లు బహూకరణ



కంప్యూటర్లు అందజేస్తున్న జాయ్ స్కూల్ యాజమాన్యం

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ ప్రాథమిక పాఠశాలకు జాయ్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యం ఐదు కంప్యూటర్లు అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం బాలనరసింహారెడ్డికి ఆ స్కూల్ యాజమాన్యం ప్రసాద్ రెడ్డి, సతీష్ కుమార్‌లు 5 కంప్యూటర్లు, ఏడాదికి ఇంటర్నెట్ సౌకర్యం అందించారు. పేద విద్యార్థులకు డిజిటల్ విద్య అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని హెచ్ఎం వారికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ స్కూల్ అకాడమీ డైరెక్టర్ స్మిత భోగరాజు, ప్రిన్సిపాల్ దాక్షాయిని, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



'ఎస్కీ' ప్రాంగణంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు



మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో.. డైరెక్టర్ డాక్టర్. లక్ష్మి, సిబ్బంది



హెచ్‌సీయూలో.. గౌరవ వందనం స్వీకరిస్తున్న వీసీ బీజేరావు, రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్



మాదాపూర్‌లోని ఖానామెట్ కోహినూర్ కమ్యూనిటీలో ..



రాయదుర్గం ఎఫ్‌డీడీఐ-హైదరాబాద్ క్యాంపస్‌లో.. ఈడీ డాక్టర్.తేజ్‌లోహిత్‌రెడ్డి

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం వాడవాడలా జాతీయ పతాకాలను ఎగురవేసి వేడుకలు నిర్వహించుకున్నారు. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్ల పరిధిలోని కాలనీలు, బస్తీలలో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. జీహెచ్‌ఎంసీ జోనల్, రెండు సర్కిల్ కార్యాలయాలు, సైబరాబాద్ కమిషనరేట్, యూనివర్సిటీలు, ట్రిపుల్ ఐటీ హైదరాబాద్, ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ,పోలీస్‌స్టేషన్లు, ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు, అపార్ట్‌మెంట్లలో జాతీయ పతాకాలను ఎగురవేశారు.

–శేరిలింగంపల్లి జోన్‌బృందం



శేరిలింగంపల్లి డివిజన్ కార్యాలయంలో.. కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్



మసీదుబండ కూడలిలో.. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్



చందానగర్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



లింగంపల్లి విద్యాంజలి స్కూల్‌లో..



శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో .. జెడ్సీహేమంత్ బోర్ఖడే , కార్పొరేటర్లు గంగాధర్‌రెడ్డి, హమీద్‌పటేల్, అధికారులు



రాయదుర్గంలో తిరంగాయాత్రలో పాల్గొన్న ఎఫ్‌డీడీఐ-హైదరాబాద్ విద్యార్థులు, ఫ్యాకల్టీ, అధికారులు



గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్ ప్రాంగణంలో.. జెండా వందనం చేస్తున్న సీపీ అవినాష్ మొహంతి, పోలీసు అధికారులు



మాదాపూర్‌లో బిల్డర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



నిథమ్‌లో.. డైరెక్టర్ ప్రొ.వెంకటరమణ, ఫ్యాకల్టీ, అధికారులు



చందానగర్ సర్కిల్ కార్యాలయంలో.. డీసీ, కార్పొరేటర్

కత్వా.. కనువిందుగా..





కత్వా వద్ద వరదనీరు సందర్శకులకు కనువిందు చేస్తుంది.. భారీ వర్షాలతో ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు పారుతుండడంతో ననాజీపూర్ కత్వ వద్ద జలపాతం దృశ్యాలు ఆహ్లాదాన్ని కల్గిస్తున్నాయి.

– శంషాబాద్ రూరల్

సిద్ధులగుట్ట జాతరకు సిద్ధం

శంషాబాద్: వెండి కొండ సిద్ధేశ్వరాలయం (సిద్ధులగుట్ట) జాతరకు ముస్తాబైంది. శంషాబాద్ పట్టణంలోని పాలరాతి కొండపై కొలువుదీరిన జంగమయ్యకు ఏటా శ్రావణమాసంలో మూడు రోజుల పాటు జాతర ఘనంగా నిర్వహిస్తారు. జాతర శనివారం నుంచి ప్రారంభమై మూడు రోజుల పాటు జరగనుంది.

ఊరేగింపుతో మొదలై...

రుద్రాభిషేకం అనంతరం పట్టణంలోని బసవేశ్వరాలయంలో శనివారం సాయంత్రం ఊరేగింపు మొదలవుతుంది. పట్టణ ప్రజలుస్వామివారిని పల్లకిలో ఊరేగించి సిద్ధులగుట్ట దేవాలయానికి తీసుకెళతారు. రాత్రి 8 గంటల తర్వాత గణపతి, ఆంజనేయస్వామి అభిషేకాలు నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం స్వామి వారి రుద్రాభిషేకం, అమ్మవారి అభిషేకం, కుంకుమార్చన, వీరభద్రస్వామి అభిషేకం, అన్నపూజ, ఆకుపూజ, అన్నప్రసాదం, రాత్రికి శివపార్వతుల కల్యాణం, భజన, సాంస్కృతిక కార్యక్రమాలు, సోమవారం అగ్నిగుండాలు, మహన్యాస రుద్రాభిషేకం, మహాబిల్వార్చన, వీరభద్రేశ్వర స్వామి అభిషేకం, కుంకుమార్చ, అమృతస్నానం, ఆశీర్వచనంతో జాతర ముగుస్తుంది.

వేలాదిగా భక్తుల రాక...

ఈ జాతరకు నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు విచ్చేస్తారు. పట్టణంలోని జాతీయ రహదారి బస్టాండ్ నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో సిద్ధుల గుట్ట దేవాలయం ఉంటుంది. ఆటోలు, ఇతర వాహనాలు ఇక్కడ అందుబాటులో ఉంటాయి. జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులను కూడా ఏర్పాటు చేసింది.

వీధుల్లోనే వ్యాపారులు...

వృథాగా వ్యాపార సముదాయం

మంజీరా రోడ్డు విస్తరణ జరిగినా వచ్చేందుకు అనాసక్తి

చందానగర్:

చందానగర్ రైల్వే స్టేషన్ సమీపంలో జీహెచ్‌ఎంసీ నిర్మించిన వీధి వ్యాపార సముదాయం నిరుపయోగంగా మారింది. సంవత్సరాలు గడుస్తున్నా ఈ సముదాయంను అధికారులు పట్టించుకోవడం లేదు. మంజీరా రోడ్డులో వీధి వ్యాపారాలతో నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని జీహెచ్‌ఎంసీ అధికారులు గత 5 సంవత్సరాల క్రితం స్థలం కేటాయించి రూ.90 లక్షల నిధులతో కాంప్లెక్స్ నిర్మించారు. సముదాయం గోడలకు పండ్లు, కూరగాయల బొమ్మలు వేయించారు. వ్యాపారులకు షాపు నంబర్లు కూడా కేటాయించారు. తదనంతరం పట్టించుకోలేదు. దీంతో నిరుపేదలు, భిక్షాటన చేసే వారికి నెలవుగా మారింది. కాగా ఇటీవల మంజీరా రోడ్డులో నూతన పైప్‌లైన్ వేసి రోడ్డు విస్తరణ కూడా చేపట్టారు. కానీ ఇప్పటికీ రోడ్లపై తోపుడు బండ్ల వ్యాపారం నిర్వహిస్తునే ఉన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వీధి వ్యాపారులకు దుకాణాలు కేటాయించి వినియోగంలోకి తీసుకురావాలి.

- చందానగర్ బీఆర్ గ్యాస్ కంపెనీ నుంచి ఆర్టీసీ కాలనీ వరకు ఉన్న మంజీరా రోడ్డులో ఇరువైపులా పండ్లు, కూరగాయల దుకాణాలతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది
- జీహెచ్‌ఎంసీ అధికారులు చిరు వ్యాపారులకు సముదాయాలలో దుకాణాలు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలి.
- భిక్షాటన చేసే వారికి ఈ సముదాయం అడ్డాగా మారింది.
- జీహెచ్‌ఎంసీ, పోలీస్ అధికారులు రోడ్డుపై ఇష్టానుసారంగా ఏర్పాటు చేసిన దుకాణాలను తరలించాలి.
- సముదాయాలలో రాత్రి సమయాలలో అసంఘటిత కార్యక్రమాలు జరుగుతున్నాయి. దీనిపై దృష్టి సారించాలి.



చందానగర్ రైల్వేస్టేషన్ వద్ద నిర్మించిన వీధి వ్యాపారుల సముదాయం

అధికారుల నిర్లక్ష్యం



వీధి వ్యాపారుల సముదాయంలో దుకాణాలు కేటాయించడంలో జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యం కనపడుతోంది. ఉన్నతాధికారులు స్ట్రీట్ వెండర్లను సముదాయాలకు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలి.

–తిమ్మారెడ్డి, చందానగర్

తాగుబోతులకు అడ్డాగా మారింది



ఒక్క దుకాణం కూడా వ్యాపారులకు కేటాయించకపోవడం తగదు. రాత్రి అయితే చాలు తాగుబోతులకు అడ్డాగా మారింది. అసంఘటిత కార్యక్రమాలు జరుగుతున్నాయి. పోలీసులు రాత్రి సమయాలలో వీధి వ్యాపారుల సముదాయం వైపు గస్తీ నిర్వహించాలి.

–వెంకటేష్, హుడా కాలనీ



కాంప్లెక్స్‌లో పేదలు నివసిస్తున్న దృశ్యం





చందానగర్ మంజీరా రోడ్డుపై ఏర్పాటు చేసిన పండ్ల దుకాణాలు

రాష్ట్ర వ్యాప్తంగా 18 మంది ఇన్నోవేటర్ల ఎంపిక

టీజీఐసీ సీఈఓ మిరాజ్ ఫహీమ్



ఇన్నోవేటర్లతో సీఈఓ మిరాజ్ ఫహీమ్

రాయదుర్గం: ప్రతిస్థాయిలోనూ ఇన్నోవేటర్లను ప్రోత్సహించడమే టీజీఐసీ లక్ష్యం అని తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ సీఈఓ మిరాజ్‌ఫహీమ్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ గ్రాస్ రూట్ ఇన్నోవేటర్లను ఎంపిక చేసి వారికి గుర్తింపు వచ్చేలా చేసేందుకు మొదటివిడతలో ఎంపికైన 18 మందికి కరీంనగర్‌లో ఐడీ కార్డులను జిల్లా కలెక్టర్ అందించారన్నారు. ఈ 18 మంది ఉమ్మడి కృషి ద్వారా రూ.20 కోట్ల వరకు ఆదాయం సమకూర్చుకున్నారని తెలిపారు. వారి కార్యకలాపాలను విస్తరించడానికి రూ.1.75 కోట్లకు పైగా నిధులు సమకూర్చడం జరిగిందని వివరించారు.

నేడు అన్నదానం

పటాన్‌చెరు టౌన్: శ్రీకృష్ణ జన్మాష్టమి నేపథ్యంలో పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ ధర్మకర్త, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... శనివారం ఉదయం స్వామివారికి అభిషేకం , ప్రత్యేక పూజలు ఉంటాయని, మధ్యాహ్నం అన్నదానం ఉంటుందన్నారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.